


TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 114 ఎడిటర్ : జి.రాజేష్ మంగళవారం 21 జులై 2026 పేజీలు : 6 వెల రూ. 4.00


## తెలుగు భాష, సంస్కృతి వైభవానికి రెండు ప్రతిష్టాత్మక ఉత్సవాలు



- జూలై 25--26న 'ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం'
- ఆగస్టు 8--9న 'అమరావతి చిత్రకళా వీధి'
- రాష్ట్ర సృజనాత్మకత,
- సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి

2లో

## సేవల సులభతరానికే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు





- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం
- డాక్యుమెంట్ రైటర్లకు ఉపాధి మార్గాలు చూపిస్తాం
- దీపం-2.0 లబ్దిదారులకు నిర్ధారిత తేదీల్లో నగదు జమ
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతిఐఎన్‌బిటైమ్స్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్

మిగతా 2లో



## క్షేత్ర స్థాయి పర్యటనలకు పవన్ కళ్యాణ్ దూరం?

మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచే విధి నిర్వహణ

2లో



2లో

## కలలు కనండి, నిజం చేసుకోవడానికి శక్తివంచన లేకుండా కృషిచేయండి

షైనింగు స్టార్స్ విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించి, సహపంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

## జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ

- పరీక్షల నిర్వహణ లోపాలపై ప్రశ్నలు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు
- పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందచేత
- దీక్ష విరమిస్తున్నట్లు సోనమ్ వాంగ్‌చుక్ వెల్లడి



2లో



## సమస్యలపై గిరిజన సంఘాలతో త్వరలో ప్రభుత్వం చర్చలు

మిగతా 2లో

- గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యమిస్తాం...ఆందోళన పడకండి!
- జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా ప్రత్యామ్నాయాలు చూస్తున్నాం
- ఉమ్మడి రాష్ట్రంలో తెచ్చిన జీవో నెంబర్ 3ను గత ప్రభుత్వం పరిరక్షించలేకపోయింది
- జోన్-1లోకి అల్లూరి సీతారామరాజు జిల్లా, జోన్-2లోకి పోలవరం జిల్లా
- బాక్సైట్ విషయంలో ఆందోళన వద్దు...అవినీతితో అంతర్జాతీయ సమస్యగా మార్చారు
- ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిపై సిఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని...ఈ విషయంలో గిరిజన ప్రజలు ఎటువంటి ఆందోళనకు, అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులుతో సచివాలయంలో సోమవారం సమీక్ష చేశారు. జీవో నెంబర్ 3 పై గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టు తీర్పు, తదనంతర పరిణామాలపై చర్చించారు. స్థానికులకే ఉద్యోగాలు దక్కడం సహా పలు అంశాలపై గిరిజన ప్రజల ఆకాంక్షలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో జీవో నెంబర్ 3 తీసుకువచ్చాం. దీని ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్లు దక్కేలా చూశాం. దాదాపు 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ ఉత్తర్వును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది

- గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యమిస్తాం...ఆందోళన వద్దు
- జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా ప్రత్యామ్నాయాలు చూస్తున్నాం
- జోన్-1లోకి అల్లూరి సీతారామరాజు జిల్లా, జోన్-2లోకి పోలవరం జిల్లా
- ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిపై సిఎం చంద్రబాబు సమీక్ష



## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది
విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం
పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం



- నేడు ఏపిలో అక్కడక్కడా వర్షాలు
- రాష్ట్రంలో వాతావరణంలో మార్పులు
- కోస్తాంధ్రలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

2లో

# సమస్యలపై గిరిజన సంఘాలతో త్వరలో ప్రభుత్వం చర్చలు

. నాటి ప్రభుత్వం ఈ అంశంపై బలమైన వాదనలు వినిపించకపోకవడం వల్ల సుప్రీంకోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టేసింది. దీంతో రెండు దశాబ్దాల పాటు గిరిజనులు పొందిన ప్రయోజనాలు కొనసాగించే వీలు లేకుండా పోయింది. నాటి ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం స్పందించలేదు. జీవో నెంబర్ 3కి ఉన్న అన్ని ప్రత్యామ్నాయ అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు 5గురు సభ్యుల ధర్మాసనం స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం.” అని అన్నారు.త్వరలో గిరిజన సంఘాలతో చర్చలుస్థానికులకే ఉద్యోగాలు అంశంతో పాటు...గిరిజనులకు సంబంధించి పలు సమస్యలపై గిరిజన సంఘాలతో వెంటనే చర్చించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై గిరిజన సంఘాలను ఆహ్వానించి...ఉన్నతాధికారులు, గిరిజన ప్రజా ప్రతినిధులు చర్చించాలని సూచించారు. జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా చేస్తున్న ప్రయత్నాలను వివరించడంతో పాటు...ఈ ప్రక్రియలో వారిని కూడా భాగస్వాములు చేయాలని సూచించారు. చట్టపరమైన అడ్డంకులు అధిగమించడానికి గిరిజన సంఘాల సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి మార్చాలని, పోలవరం జిల్లాను జోన్ 2లో చేర్చాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాక్సైట్ మైనింగ్ విషయంలో గిరిజనులు ఎటువంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. గత పాలకులు తమ అవినీతి కారణంగా బాక్సైట్ లీజుల అంశం ఇప్పుడు అంతర్జాతీయ కోర్టులకు వెళ్లిందని గుర్తు చేశారు. గిరిజనుల హక్కులకు, మనోభావాలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు ఉండవని....ఈ విషయంలో ఎవరి ట్రాప్ లోనూ పడవద్దని సిఎం సూచించారు. అలాగే 1/70 అమలు విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదని... ఇదే విషయాన్ని గిరిజన సంఘాలకు చెప్పాలని సిఎం సూచించారు. అరకు కాఫీని ప్రమోట్ చేసినా...గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, రవాణా సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసినా అది కూటమి ప్రభుత్వం గిరిజనులపై చూపిన బాధ్యత అన్నారు. గిరిజన ప్రాంతాల్లో కూడా పూర్తి స్థాయి అభివృద్ధి



జరిగినప్పుడే...వారి జీవన ప్రమాణాలు మారినప్పుడే నిజమైన అభివృద్ధి అని ప్రభుత్వం నమ్ముతోందన్నారు. గిరిజన సంఘాలతో చర్చలకు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని సిఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులకు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. సిఎం సూచన మేరకు త్వరలోనే గిరిజన సంఘాలను ఆహ్వానించి చర్చించనున్నారు. సమీక్షలో మంత్రి సంధ్యారాణి, సీఎస్ సాయి ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ నాయక్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కలలు కనండి, నిజం చేసుకోవడానికి శక్తివంచన లేకుండా కృషిచేయండి

ఏలూరు, జూలై 20



పెదపాడు మండలం వట్లూరు సి.ఆర్.రెడ్డి ఆడిటోరియంలో సోమవారం షైనింగు స్టార్స్ కార్యక్రమం అనంతరం అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో మమేకమై విద్యాభ్యాసం, లక్ష్యాలు, భవిషత్తు కార్యాచరణ గురించి జిల్లా కలెక్టరు ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కలలు కనండి, నిజం చేసుకోవడానికి శక్తివంచన లేకుండా కృషిచెయ్యాలని అన్నారు. దేశభవిష్యత్తు యువత చేతిలో ఉందని గ్రహించి ముందుకు అడుగులు వెయ్యాలని అన్నారు. యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యతో పాటు నైపుణ్యాలు అభివృద్ధి, మంచి విలువలు, సంస్కృతి సంప్రదాయాలు, పెద్దలంటే గౌరవం, సమయపాలన అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చునని హితబోధ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న విద్యాఅవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తమకలలను సాకారం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విజయమే జిల్లా అభివృద్ధికి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, డిఐవో కె.యోహాను, పరీక్షలు నిర్వహణ సహాయ కమిషనరు ఆర్.ఆశ, తహాశీల్దారు ఏ.కృష్ణజ్యోతి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయి పర్యటనలకు పవన్ కళ్యాణ్ దూరం?

అమరావతి, జులై 20 ఇటీవల కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అధికారిక కార్యక్రమాలకు అందుబాటులోకి రావాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పిఠాపురం, పార్వతీపురం మన్యం జిల్లాలోని పెదపెంకి గ్రామం, రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ల సందర్శనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అయితే క్షేత్ర స్థాయి పర్యటనల సందర్భంగా జనసమూహం మధ్యకు వెళ్లిన సందర్భంలో శస్త్ర చికిత్స చేసిన భుజానికి ఏ మాత్రం అసౌకర్యం కలిగినా గాయం తిరగబెడుతుందని, అలాంటి పరిస్థితి ఏర్పడితే మరోమారు సరిచేయడం కూడా క్లిష్టతరమవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. ఎడమ భుజానికి కూడా ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కనీసం మరో రెండు వారాల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలకు దూరంగా ఉండాలని వైద్యులు ఉప ముఖ్యమంత్రివర్యులకు సూచించారు. వైద్యుల సలహా మేరకు క్షేత్ర స్థాయి పర్యటనల షెడ్యూలు మార్చాలని కార్యాలయ అధికారులకు సూచనలు చేశారు.అదే సమయంలో అధికారిక కార్యక్రమాలకు ఇబ్బంది కలగకుండా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి విధులు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

న్యూఢిల్లీ,జూలై20 పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి.



స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

అమరావతి,జూలై20 ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర కోస్తా ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకో నున్నట్లు వెల్లడించింది. కోస్తాంధ్రలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. మేఘా వృత వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. శ్రీకాకు ళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం ప్రాంతం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో అత్యధికంగా 66.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. అలాగే పెంజెరువులో 42.5 మిల్లీమీటర్లు, సోమలింగపాలెంలో 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.


వర్షాలు, పిడుగులు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద నిలబడవద్దని, అలాగే భారీ హోర్డింగులు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. అలాగే సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున చిన్న పడవలతో వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు అధికారులు సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## తెలుగు భాష, సంస్కృతి వైభవానికి రెండు ప్రతిష్టాత్మక ఉత్సవాలు

అమరావతి, రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి పునర్వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు.విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ, నృత్య సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ దిశగా జూలై 25, 26 తేదీలలో ఉండవల్లి గుహల ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం' ను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషను కేవలం మాట్లాడే భాషగా కాకుండా, భావితరాలకు వారసత్వంగా అందించే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని రూపొందించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో 'సూర్యోదయ సుప్రభాతం' సంగీత కార్యక్రమం, 'ఆమె మాట -- అక్షర బాట', కవి సమ్మేళనాలు, 'అమ్మమ్మ కథల ముచ్చట్లు', 'నెక్స్ట్ జెన్ తెలుగు' యువతతో చర్చలు, 'నవస్వరం' ప్యానెల్ డిస్కషన్లు, తపాలా శాఖ సహకారంతో పూర్తిగా తెలుగులో పోస్టుకార్డులు రాసే వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ

న్యూఢిల్లీ,జూలై20: నీట్, ఇతర పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన ఓ లేఖను ఆయనకు అందజేశారు. సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా సుమారు పది నిమిషాల పాటు నడ్డాతో భేటీ అయ్యారు. వారి





డిమాండ్లను పరిశీలించి, ప్రభుత్వంలోని సంబంధిత స్థాయిలో చర్చిస్తానని నడ్డా హామీ ఇచ్చారని సౌరవ్ దాస్ తెలిపారు. అయితే.. ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన హామీలు లభించలేదని, డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని వెల్లడించారు. జేపీ నడ్డాకు సమర్పించిన లేఖలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర విమర్శలు చేసింది సీజేపీ. నీట్ యూజీ-2026 ప్రశ్నపత్రం లీకేజీ సహా ఇతర పరీక్షల నిర్వహణలో తలెత్తిన లోపాలకు మంత్రి బాధ్యత వహించాలని పేర్కొంది.

# సేవల సులభతరానికే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు

సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

**సేవల సులభతరానికే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం-ఆర్ఎస్కె లను ఏర్పాటు చేస్తున్నాం. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయి. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించండి. పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైంది. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుంది. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలి. అలాగే డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతాం. దీపం-2.0 పథక లబ్దిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్ధతిలో ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ-ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలి. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.




**లిటిగెంట్ పిటిషనర్లకు కౌన్సెలింగ్..**

లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి. ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదు దారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించాం. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలి. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలి.

# అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ

### సిజెపిని చర్చలకు పిలిచిన జెపి నడ్డా





న్యూఢిల్లీ,జూలై20 సిజెపి కార్యకర్తల చలో పార్లమెంట్ పిలుపుతో ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్లమెంట్ భవనం లోపల వీరి భేటీ జరిగినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. 'చలో పార్లమెంట్' వేళ ఈ నిరసనలనకు నాయకత్వం వహిస్తున్న నాయకులతో కేంద్రమంత్రి జేపీ నడ్డా భేటీ అయ్యారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్ కూడా వారితో మాట్లాడుతున్నారు. మరోవైపు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జేపీ నడ్డా కలవనున్నారని సమాచారం. పరీక్షల నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చిందని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సోమవారం ప్రకటించింది. తమ డిమాండ్లను వివరించేందుకు ఇద్దరు అధికార ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ కానున్నట్లు సీజేపీ వెల్లడించింది. అయితే.. ఈ చర్చల అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇదిలా ఉండగా.. పరీక్షల అవకతవకలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది సీజేపీ కార్యకర్తలు, నిరసనకారులు ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపునకు ర్యాలీగా వెళ్లేందుకు యత్నించగా భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ బలగాలు, సీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకోగా.. పలువురు పోలీసులు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. దీంతో టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు పోలీసులు. ఈ క్రమంలో పార్లమెంట్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల మధ్య సీజేపీ ప్రతినిధులు.. జేపీ నడ్డాతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చల అనంతరం పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# మూడు కాదు..ఒక్క దాంట్లో గెలిచి చూపండి


### మరోమారు బిజెపి నేతలకు రాజాసింగ్ సవాల్



హైదరాబాద్,జూలై20(: నగరంలో మూడు కార్పోరేషన్లు గెలుస్తామని బిజెపి నేతలు ప్రకటించడాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎద్దేవా చేశారు. మూడు కాదు..ఒక్కటైనా గెలిచి చూపాలని విమర్శలు గుప్పించారు. రాష్ట్గరంలో బిజెపి నేతల తీరుపై, రాష్ట్రంలో బీజేపీ పరిస్థితిపై ఆ పార్టీ బహిష్కృత నేత రాజాసింగ్ సెటైర్లు వేశారు. బండి సంజయ్, ఈటల కలిస్తే పార్టీ అధికారంలోకి వస్తుందా.. అని పార్టీ రాష్ట్ర నేతలను ప్రశ్నించారు. వారి మధ్య సమస్యలు ఉండవచ్చని, పార్టీలో సీనియర్ నేతలు, కార్యకర్తల పరిస్థితి ఏంటని నిలదీశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కార్పొరేషన్‌లు గెలుస్తామని చెబుతున్నారని, ఒక్క కార్పొరేషన్‌లో సగం సీట్లయినా గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. బీజేపీలో కొందరికి అధ్యక్ష పదవి దక్కకుండా చేసేందుకే రాంచందర్‌రావును కూర్చొబెట్టారని పేర్కొన్నారు. రాంచందర్‌రావు చేతులు కట్టేసి పని చేయమంటే ఎట్లా..? అంటూ ప్రశ్నించారు. రాంచందర్‌రావు ఎంత బాధలో ఉన్నారో తెలుసని, ఒకరు చెప్పినట్టు పని చేయాలంటే ఎలా చేస్తారంటూ పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నేతల్లో సయోధ్య లేదని, అలాగే, పార్టీ పటిష్టతపై అవగాహన లేదన్నారు.

# పోలీసుల లాఠీలకు బెదరని యువకుడు

### కొట్టండి సర్ అంటూ...గట్టిగా అరుస్తూ నిరసన




న్యూఢిల్లీ,జూలై20 నీట్‌తో పాటు జాతీయ ప్రవేశ పరీక్షల్లో అక్రమాలపై పోరాడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి చెందిన నిరసనకారుడు భద్రతా దళాల లాఠీలకు ఏమాత్రం భయపడలేదు, బెదరలేదు. పైగా 'నన్ను కొట్టండి సర్, కొట్టిండి' అని గట్టిగా అరిచాడు. దీంతో భద్రతా సిబ్బంది షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నీట్ అక్రమాలపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ కార్యకర్తలు నిరసన కొనసాగిస్తున్నారు. కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడంతో సీజేపీ కార్యకర్తలు ర్యాలీగా అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పార్లమెంట్ వైపు దూసుకెళ్తున్న వారిని అడ్డుకునేందుకు భద్రతా దళాలు ప్రయత్నించాయి. సీజేపీ కార్యకర్తలను నిలువరించేందుకు లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పాయువు ప్రయోగించారు. ఈ నేపథ్యంలో కొందరు నిరసకారులు అక్కడి నుంచి కాస్త దూరంగా పరుగెత్తారు. అయితే ఒక నిరసకారుడు మాత్రం భద్రతా దళాల లాఠీఛార్జ్‌కు భయపడలేదు. అతడు ఏమాత్రం బెదరలేదు. పైగా లాఠీ దెబ్బలను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాడు. లాఠీలు ఝులిపిస్తున్న భద్రతా సిబ్బందితో 'నన్ను కొట్టండి సర్, కొట్టిండి' అని గట్టిగా అరిచాడు. దీంతో భద్రతా సిబ్బంది షాక్ అయ్యారు. కొంతసేపు అలాగే ఉండిపోయారు. ఇంతలో పక్కనే ఉన్న కొందరు భద్రతా సిబ్బంది జోక్యం చేసుకున్నారు. ఆ నిరసకారుడిని అక్కడి నుంచి వెనక్కి తీసుకెళ్లారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఈ నేపథ్యంలో పలువురు రాజకీయ నేతలు, నెటిజన్లు దీనిపై స్పందించారు. 'తమ హక్కులు, ఉపాధి, దేశ రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు యువత ఎప్పుడు వీధుల్లోకి వచ్చినా అణచివేత, భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాలకవర్గం పాల్పడుతుంది. లాఠీలు, బారికేడ్లు, పోలీసుల రక్షణ వెనుక ప్రభుత్వం ఇంకెంతకాలం దాక్కుంటుంది?' అని 'ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ' జాతీయ నాయకుడు ధీరజ్ గుర్జార్ ప్రశ్నించారు.

# అభిజిత్ దీప్కే అరెస్ట్ వార్తలు

### పుకార్లను నమ్మవద్దని ఢిల్లీ పోలీసుల వెల్లడి




న్యూఢిల్లీ,జూలై20: కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధ్యక్షుడు అభిజిత్ దీప్కేను అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను నమ్మ వద్దని ప్రజలకు వారు స్పష్టం చేశారు. అభిజిత్ దీప్కే .. జంతర్ మంతర్ ధర్నా పాయింట్ వద్ద ఉన్నారని ఢిల్లీ పోలీసులు వివరించారు. అభిజిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం కానీ.. అరెస్ట్ చేయడం కానీ జరగలేదని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలోని లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం చలో పార్లమెంట్‌కు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ యాత్రలో భారీగా యువత పాల్గొంది. ఈ యాత్రను అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ భారీగా ఏర్పాట్లు చేశారు. అయినా నిరసనకారులు భారీ సంఖ్యలో పార్లమెంట్ వైపునకు దూసుకెళ్లారు. వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. భాష్పవాయుగోళాలు ప్రయోగించారు. దీంతో నిరసనకార్లు.. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇంకోవైపు ఈ యాత్రలో పాల్గొన్న సోనమ్ వాంగ్ చుక్ భార్య గీతాంజలి జుట్టు పట్టుకుని ఢిల్లీ పోలీసులు లాగారు. దీంతో గీతాంజలిపై పోలీసులు దాడి చేశారంటూ సీజేపీ ఆరోపించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న 12 ఏళ్ల బాలికపై పోలీసులు దాడి చేశారని.. దీంతో ఆమె తల పగిలిందని వివరించింది. మరో 40 నుంచి 50 మంది సీజేపీ కార్యకర్తల తలలు పగిలిపోయాయని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో పార్లమెంట్, జంతర్ మంతర్‌తోపాటు ఢిల్లీలోని వివిధ ముఖ్య ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. జూన్ 28వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం బలవంతంగా సప్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన చలో పార్లమెంట్ యాత్రకు ఆయన మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే.

# దీక్ష విరమించినట్లు దీప్కే ప్రకటన

### సోనమ్ విజ్ఞప్తితో దీక్ష విరమించిన సిజెపి నేత

న్యూఢిల్లీ,జూలై20 కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన ఆమరణ దీక్షను విరమించారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభ్యర్థన మేరకు దీప్కే తన దీక్షను విరమించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ మార్చ్ చేస్తున్న వారికి సంఘీభావంగా దీక్షను విరమించాలని వాంగ్‌చుక్ కోరారు. డెహ్రాడూన్‌కు చెందిన నీట్ అభ్యర్థి రాయ్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె తండ్రితో కలిసి దీప్కే దీక్షను విరమించారు. ప్రస్తుతం సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్ చికిత్స పొందుతున్నారు. జంతర్ మంతర్ వద్ద ఆయన దీక్షను పోలీసులు భగ్నం చేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. వాంగ్‌చుక్‌ను తరలించిన తర్వాత .. అభిజీత్ దీప్కే ఆమరణ దీక్షకు పూనుకున్నారు. మరో వైపు పార్లమెంట్‌లో విద్యార్థుల ఆందోళనపై రచ్చ కొనసాగుతోంది. ఇవాళ ప్రారంభమైన ఉభయసభల్లోనూ విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి.

నీట్ పేపర్ లీకేజీ అంశంపై చర్చ చేయాలని డిమాండ్ చేశాయి. దీంతో ఇప్పటికే పలుమార్లు లోక్‌సభ, రాజ్యసభలు వాయిదా పడ్డాయి. విద్యార్థుల గొంతును ప్రభుత్వం నొక్కేస్తోందని రాజ్యసభలో ఖర్గే ఆరోపించారు. పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనేందుకు తనకు అవకాశం ఇవ్వాలని వాంగ్‌చుక్ కోరారు. ఆస్పత్రి నుంచి తాత్కాలికంగా డిశ్చార్జ్ చేయాలని కోరినట్లు తెలిసింది.

# నత్తనడకన సర్ డిజిటైలేషన్

### కేవలం 65 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం




హైదరాబాద్,జూలై20 రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ నత్తనడకన సాగుతున్నది. మరోవైపు అధికారులేమో 90 శాతం పూర్తయిందంటూ ప్రకటనలు ఇస్తున్నారు. బిఎల్‌వోలు తమ ఇంటికి రాలేదని, తమకు ఫారాలు ఇవ్వలేదని పలుచోట్ల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్ ల పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ వాటికి సంబంధించిన ఆన్‌లైన్ డాటా ఎంట్రీ పక్రియ మందకొడిగా నడుస్తున్నది. ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయానికి అందిన గణాంకాల ప్రకారం..


రాష్ట్రవ్యాప్తంగా 2,19,23, 435 ఈఎఫ్‌ల 64.81 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. గ్రామీణ జిల్లాలతో పోలిస్తే ఎకువ ఓటర్లున్న నగర, ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాల్లో ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ మెల్లగా సాగుతున్నది. మేడ్చల్ మలాజిగిరి జిల్లాలో అత్యంత తకువగా 37.30శాతం ఈఎఫ్‌లు మాత్రమే డిజిటలైజ్ కాగా, హైదరాబాద్ జిల్లాలో 39.59శాతం , రంగారెడ్డి జిల్లాలో 48.52శాతం ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ పూర్తయింది. వీటితో పోలిస్తే గ్రామీణ జిల్లాలు చాలా ముందంజలో ఉన్నాయి. ఇప్పటివరకు 88.43? ఈఎఫ్‌ల డిజిటలైజేషన్‌తో యాదాద్రి భువనగిరి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సిద్దిపేట (83.55శాతం), నల్లగొండ (82.74శాతం), కుమ్రంభీం ఆసిఫాబాద్ (81.63శాతం) జిల్లాలు ఉన్నాయి.

# రోడ్డు దాటుతుండగా ఢీకొన్న ఆటో

### వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం

హైదరాబాద్,జూలై20 నగరంలోని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. హైదర్‌నగర్ వద్ద రోడ్ క్రాస్ చేస్తుండగా ఆటో ఢీ కొట్టడంతో నర్సింహ(60) అనే వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి వీడియో సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. మృతుడు జహీరాబాద్‌లోని శిశుమందిర్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేసి రిటైర్ అయినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటూ జహీరాబాద్‌లో ఇల్లు కన్‌స్ట్రక్షన్ చేయిస్తున్నాడు. ఈ క్రమంలో ఈరోజు(సోమవారం) జహీరాబాద్ వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన ఆటో.. నర్సింహను బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన స్పాట్‌లోనే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నర్సింహ మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.







# పివి సింధుకు రాజమౌళి శుభాకాంక్షలు

మీ మూవీలో పరిచయ నటిగా ఛాన్స్ ఇమ్మంటూ షట్లర్ రిప్లై

జపాన్ ఓపెన్ టైటిల్ విజేతగా నిలిచి భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు తేజంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో అగ్ర దర్శకుడు రాజమౌళి పోస్ట్‌కు సింధు ఇచ్చిన రిప్లై అందరినీ ఆకర్షిస్తూనే నెట్టింట ఆసక్తికర చర్చకు దారి తీసింది.సింధును అభినందిస్తూ రాజమౌళి ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించావు. మంచి కమ్ బ్యాక్ ఇచ్చావు. కంగ్రాట్స్ సింధు. నిన్ను చూసి దేశం గర్విస్తోందని శు భాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన ఆమె.. ధన్యవాదాలు రాజమౌళి సర్. మీ వారణాసి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఒకవేళ మీరు తెరకెక్కించే ఏ సినిమాలో అయినా బ్యాడ్మింటన్ ప్లేయర్ పాత్ర ఉంటే.. మీ పరిచయ నటిగా మారడానికి నేను ఎంతో సంతోషిస్తాను' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పంచుకున్నారు.

# రాకా మూవీలో జాయిన్ అయిన నటి సిరి హన్మంతు







టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.

# శ్రీనివాస మంగాపురం నుంచి రావే చెలియా విడుదల




ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రషా థడానీ కథానాయికగా అలరించనున్నారు. జులై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. రావే చెలియా అంటూ సాగే ఈ పాటలో 'నా ప్రాణం నను వీడి.. నీ వైపే కదిలేనే' అనే లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.




# సోషల్ మీడియాకు దూరంగా ఉంటే.. హాయిగా ఉంది

నటి ఐశ్వర్య లక్ష్మి వెల్లడి సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల ప్రాణం హాయిగా ఉందని కేరళ సోయగం ఐశ్వర్య లక్ష్మి అన్నారు. తాజా ఇంటర్వ్యూలో తాను చేస్తున్న సినిమాల గురించి, సోషల్ మీడియా గురించి ఆసక్తికరంగా మాట్లాడారామె. 'ఒకప్పుడు సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండేదాన్ని. కానీ నా ఫొటోలు మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కామెంట్లు పెట్టి కొందరు నన్ను బాధపెట్టారు. వాళ్ల వల్ల అంతా నన్ను ద్వేషిస్తున్నట్టు అనిపించేది. ఇప్పుడు సోషల్‌మీడియాకు దూరంగా, ప్రేక్షకులకు దగ్గరగా ఉంటున్నా. వందకోట్లు ఇచ్చినా మళ్లీ సోషల్ మీడియా జోలికి మాత్రం పోను' అంటూ తెగేసి చెప్పింది ఐశ్వర్య లక్ష్మి. తన తాజా సినిమా 'గట్టాకుస్తీ 2' గురించి మాట్లాడుతూ 'గట్టాకుస్తీ 2' మంచి విజయం సాధించిందని అంతా అంటుంటే ఆనందంగా ఉంది. స్త్రీ,పురుష సమానత్వాన్ని ప్రతిబింబించే సినిమా అది. అందుకే అది నా మనసుకు దగ్గరైన సినిమా.' అంటూ ఐశ్వర్యలక్ష్మి ఆనందం వెలిబుచ్చింది. ప్రస్తుతం ఓ ఫీమేల్ సెంట్రిక్ మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నది ఐశ్వర్యలక్ష్మి. 'తీవియన్ పొట్టు', 'లవ్' అనే వెబ్ సిరీస్‌లు కూడా ఈ అమ్మడి చేతిలో ఉన్నాయి. త్వరలో తెలుగు ప్రేక్షకులను కూడా ఈ అందాలభామ పలకరించనున్నదని టాక్.

-----------


# కొరియన్ కనకరాజులో రాసా గుమ్మడి పాట విడుదల




'మాస్ మెచ్చే అన్ని అంశాలు ఉన్న సినిమా 'కొరియన్ కనకరాజు అన్నారు దర్శకుడు మేర్లపాక గాంధీ. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ హీరోగా నటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఆగస్టు 7న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు.

'రాసా గుమ్మడి' అంటూ రాయలసీమ జాతర నేపథ్యంలో సాగే ఈ మాస్ పాటకు తమన్ స్వరాలు సమకూర్చారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. నల్గొండ గద్దర్ ఆలపించారు. ఈ పాటలో వరుణ్ – దక్ష నగార్కర్ వేసిన మాస్ స్టెప్పులు.. వాళ్లిద్దరి కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచాయి. వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. 'ఈ పాట అందరికీ నచ్చిందనుకుంటున్నా. మా పెద్దనాన్న చిరంజీవిని దృష్టిలో పెట్టుకుని ఈ పాటకి డ్యాన్స్ చేశా' అన్నారు. 'ఇందులో వరుణ్ యాక్షన్.. సత్యతో కలిసి చేసిన కామెడీ.. అన్నీ అలరిస్తాయని అన్నారు మేర్లపాక గాంధీ.

# వరుస సినిమాలతో మమతా బైజు బిజీ



'ప్రేమలు' సినిమాతో సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన అందాలభామ మమితాబైజు ఇప్పుడు అన్ని భాషల్నీ కవర్ చేస్తూ వరుసపెట్టి సినిమాలు చేస్తున్నది. అగ్రహీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి ఆమె నటించిన 'జననాయగన్' చిత్రం ఈ నెల 23న విడుదలకానున్న విషయం తెలిసిందే. ఇక సూర్యతో ఆమె నటించిన తెలుగు సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదల కానున్నట్టు తెలుస్తున్నది.

దర్శకుడు వెంకీ అట్లూరి ఫ్యామిలీ, లవ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక మలయాళంలో మమితా నటించిన 'బెత్లెహం కుటుంబ యూనిట్' ఆగస్ట్ 21న రిలీజ్ కానుంది. ఫహాత్ ఫాజిల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమత సరికొత్త పాత్రలో కనిపించనున్నది.

నివిన్ పౌలీ హీరో. ఈ విధంగా విజయ్, సూర్య, నివిన్‌పౌలీ వంటి ప్రముఖ నటుల సినిమాల్లో నటిస్తూ అద్భుతమైన కెరీర్‌ని కొనసాగిస్తున్నది మమితా బైజు.